సాక్షి కామారెడ్డి

ఆదివారం । 19 । జనవరి । 2025



రెండు రోజుల్లో పూర్తి చేయాలి
సంక్షేమ పథకాల అమలు కోసం చేపట్టిన సర్వేలను రెండు రోజుల్లో పూర్తి చేయాలని అధికారులు సూచించారు.
- 9లో ▸



ఇరుకు వంతెనలతో..
లింగంపేట మండలంలో పలు చోట్ల ఉన్న పాత వంతెనలు శిథిలావస్థకు చేరి, ప్రమాదకరంగా మారాయి.
- 9లో ▸

గరిష్టం/కనిష్టం
29.0 /12.2

వాతావరణం
ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత పెరిగే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

సింగపూర్ పర్యటనలో పోచారం



బాన్సువాడ : ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి సింగపూర్ పర్యటనకు వెళ్లారు. అక్కడ శనివారం తెలంగాణ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో గ్లోబల్ ఇండియన్ ఇంటర్నేషనల్ స్కూల్ అడిటోరియంలో నిర్వహించిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో పాల్గొన్నారు. వారి వెంట తెలంగాణ కల్చరల్ సొసైటీ (సింగపూర్) అధ్యక్షుడు గడప రమేష్‌బాబు, కాంగ్రెస్ నాయకుడు రోహిత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

లీలారామన్ మృతికి సంతాపం



లీలా రామన్, బీఎస్ రామన్

కామారెడ్డి అర్బన్ : కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల భవనానికి 1963 సంవత్సరంలో పునాదిరాయి వేయడంతో పాటు నిర్మాణ సమయంలో ఉమ్మడి నిజామాబాద్ కలెక్టర్‌గా పనిచేసిన దివంగత బీఎస్.రామన్ భార్య లీలా రామన్ (94) శుక్రవారం అమెరికాలో మృతి చెందారు. ఆమె మృతికి తెరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.శంకర్ సంతాపం తెలిపారు. 2019లో నిర్వహించిన కళాశాల వార్షికోత్సవంలో రామన్ దంపతులు పాల్గొని, రాశివనంలో వేప, మర్రి మొక్కలు నాటారని, కళాశాల అభివృద్ధికి రూ. 5 లక్షల విరాళం ఇచ్చారని గుర్తు చేసుకున్నారు. కళాశాల అభివృద్ధికి రామన్ దంపతులు చేసిన కృషిని పలువురు విద్యాభిమానులు కొనియాడారు.

'ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు'



నిజాంసాగర్: ఎరువులను ఎక్కువ ధరకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయశాఖ అధికారి తిరుమల ప్రసాద్ హెచ్చరించారు. శనివారం ఆయన అచ్చంపేట, మల్లూర్ సహకార సంఘాలు, ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా, ఎరువులకు ఇతర మందులను అంటగట్ట వద్దన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయశాఖ అధికారి అమర్‌ప్రసాద్, అచ్చంపేట సొసైటీ సీఈవో సంగమేశ్వర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: మైనారిటీ గురుకుల విద్యాలయాల్లో వచ్చే విద్యా సంవత్సరంలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి దయానంద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 5, 6, 7, 8 తరగతుల్లో ప్రవేశాల కోసం వచ్చేనెల 28 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మైనారిటీ విద్యార్థులకు ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్ పద్ధతిలో సీట్లు కేటాయిస్తామని, ఇతర వర్గాల వారికి లక్కీ డ్రా ఆధారంగా సీట్లు కేటాయిస్తామని వివరించారు.

'సమస్యలు పరిష్కరించాలి'



కామారెడ్డి అర్బన్ : జిల్లాలోని ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని టీఎన్జీవోస్ జిల్లా నాయకులు అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) విక్టర్‌ను కోరారు. శనివారం టీఎన్జీవోస్ ప్రతినిధులు అడిషనల్ కలెక్టర్‌ను కలిసి సమస్యలు వివరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి, కార్యదర్శి ముల్క నాగరాజు, అసోసియేట్ అధ్యక్షుడు ఎం.చక్రధర్, కోశాధికారి ఎం.దేవరాజు, ప్రతినిధులు యు.సాయిలు, రాజ్యలక్ష్మి, అబ్దుల్‌ఖదీర్, రాజమణి తదితరులు పాల్గొన్నారు.

భార్యాభర్తలు.. సివిల్ సర్వెంట్లు



- వేర్వేరు జిల్లాల్లో సేవలు
- పాలనలో తమదైన ముద్ర
- సెలవులొస్తే కుటుంబంతో సరదాగా..

దేశ పరిపాలనా వ్యవస్థలో అతిముఖ్య రంగం సివిల్ సర్వీస్.. సివిల్ సర్వీసెస్‌లో ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్(ఐఏఎస్), ఇండియన్ పోలీస్ సర్వీస్ (ఐపీఎస్)లతో పాటు మరెన్నో సర్వీసెస్ ఉంటాయి. కలెక్టర్లుగా పనిచేసేది ఐఏఎస్ అధికారులే.. జిల్లా యంత్రాంగం మొత్తం వారి అజమాయిషీలోనే పనిచేస్తుంది. అలాగే శాంతిభద్రతలకు సంబంధించి జిల్లా పోలీసు అధికారిగా ఐపీఎస్ అధికారి ఉంటారు. జిల్లా పోలీసు యంత్రాంగం అంతా ఎస్పీ ఆధీనంలో పనిచేస్తుంది. అటవీ శాఖకు సంబంధించి సివిల్ సర్వీసెస్ ద్వారా ఎంపికైన ఐఎఫ్ఎస్ అధికారులు జిల్లా అటవీ బాధ్యతలు చూస్తారు. ఇలాంటి కేంద్ర సర్వీసుల ద్వారా జిల్లాలో పనిచేస్తున్న అధికారులు అదే సర్వీసులో పని చేస్తున్న వారిని జీవిత భాగస్వాములుగా ఎంచుకున్నారు. వారిపై 'సండే స్పెషల్'..

– సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

సండే స్పెషల్

భార్య ఐపీఎస్.. భర్త ఐఏఎస్



2014 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి సింధుశర్మ కామారెడ్డి జిల్లా పోలీస్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నారు. ఆమె భర్త శశాంక 2013 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి. మొన్నటి వరకు ఆయన రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా పనిచేశారు. ఇటీవలే స్టేట్ ఫ్లాగ్‌షిప్ ప్రాజెక్టు కమిషనర్‌గా నియమితులయ్యారు. కామారెడ్డిలోనే నివాసం ఉంటున్న ఎస్పీ సింధుశర్మ.. హైదరాబాద్‌లో ఉంటున్న ఆమె భర్త శశాంక వీకెండ్స్‌లో కుటుంబ సభ్యులతో కలుస్తారు. జిల్లాలో కేసుల నమోదుతో పాటు ఛేదనలోనూ ఎస్పీ సింధుశర్మ ముందున్నారు. పోలీసు శాఖలో తనదైన శైలిలో పనిచేస్తూ ప్రత్యేకతను చాటుకుంటున్నారు.

ఇద్దరూ ఐఏఎస్ అధికారులే..



2016 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి ఆశిష్ సంగ్వాన్ కామారెడ్డి జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఆయన భార్య 2016 బ్యాచ్‌కే చెందిన వల్లూరు క్రాంతి కూడా ఐఏఎస్ అధికారి. ఆమె సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. భార్యాభర్తలిద్దరూ జహీరాబాద్ లోక్‌సభ నియోజక వర్గంలోని రెండు జిల్లాల్లో పనిచేస్తుండడం విశేషం. ఇద్దరూ పాలనలో తమదైన ముద్ర వేశారు. కామారెడ్డి జిల్లా పరిపాలనలో సంగ్వాన్ అనేక మార్పులకు శ్రీకారం చుట్టి వాటిని అమలు చేస్తున్నారు. సెలవు రోజుల్లో ఇద్దరూ ఒక చోటుకు చేరుకుంటారు. కుటుంబ సభ్యులతో ఆ రోజు ఉల్లాసంగా గడుపుతారు.

ఐఎఫ్ఎస్ జోడీ..

2017 బ్యాచ్‌కు చెందిన ఐఎఫ్ఎస్ అధికారి బోగ నిఖిత కామారెడ్డి జిల్లా అటవీ అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆమె భర్త వికాస్ మీనా కూడా 2017 బ్యాచ్‌కు చెందిన ఐఎఫ్ఎస్ అధికారే. ఆయన నిజామాబాద్ డీఎఫ్‌వోగా పనిచేస్తున్నారు. యువ అధికారులు ఇద్దరూ ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పరిధిలోనే విధులు నిర్వహిస్తున్నారు. ఇద్దరూ రెండు జిల్లాల అడవులను చుట్టేస్తున్నారు. అడవుల అభివృద్ధి విషయంలో వారు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ గుర్తింపు పొందారు. పక్క పక్క జిల్లాల్లో పనిచేస్తుండడం వారికి అనుకూలంగా ఉంది.



భార్య ఐఏఎస్.. భర్త గ్రూప్-1 ఆఫీసర్



2022 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి డాక్టర్ కిరణ్మయి కొప్పిసెట్టి సబ్ కలెక్టర్ హోదాలో బాన్సువాడలో పనిచేస్తున్నారు. ఆమె భర్త ఎం.విజయ్‌కుమార్ సివిల్స్ కోసం ప్రయత్నించారు. ఇంటర్వ్యూ దాకా వెళ్లిన ఆయన సివిల్స్ సాధించలేకపోయారు. తాను సాధించలేని సివిల్స్ దిశగా భార్యను ప్రోత్సహించారు. విజయ్‌కుమార్ 2012 లో గ్రూప్-1 కు ఎంపికై కమర్షియల్ ట్యాక్స్ డిపార్టుమెంట్‌లో డిప్యూటీ కమిషనర్‌గా ఉద్యోగంలో చేరారు. ఆయన కూడా ఉన్నత స్థాయిలో పనిచేస్తున్నారు.

నాలుగు పథకాలపై ఎన్నో ఆశలు!

- అర్హుల ఎంపిక కోసం కొనసాగుతున్న సర్వేలు
- లబ్ధి చేకూరుతుందో లేదోనని జనంలో ఆందోళన
- నేడు ఉమ్మడి జిల్లా అధికారులతో మంత్రి జూపల్లి సమీక్ష



క్యాసంపల్లిలో సర్వేపై సూచనలిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు భరోసా, రైతు ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆహార భద్రత కార్డుల జారీపై పేదలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అయితే అర్హులకు లబ్ధి చేకూరుతుందో లేదోనన్న ఆందోళన జనంలో కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఆదివారం ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులతో జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు నిజామాబాద్‌లో నిర్వహించే సమావేశంపై అందరి దృష్టి కేంద్రీకృతమైంది. ఈ సమావేశంలో ఆయా పథకాల అమలు విషయంలో ఆయన దిశానిర్దేశం చేస్తారని భావిస్తున్నారు.

గణతంత్ర దినోత్సవం రోజు నుంచి నాలుగు పథకాలను అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అందుకు అనుగుణంగా లబ్ధిదారుల ఎంపిక కోసం క్షేత్ర స్థాయిలో సర్వే చేస్తున్నారు. సర్వే అనంతరం ఈనెల 21 నుంచి 24 వరకు గ్రామ సభలు నిర్వహించి, లబ్ధిదారుల జాబితాను ఆమోదించనున్నారు. 26 నుంచి లబ్ధిదారులకు ఆయా పథకాలను పంపిణీ చేస్తారు. గతేడాది నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో జిల్లాలో 2.38 లక్షల మంది ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆయా దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తున్నారు. ప్రభుత్వం తొలి విడతలో ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున మంజూరు చేస్తామని ప్రకటించింది. అర్హులైన పేదలను గుర్తించి వారికి తొలుత ప్రాధాన్యతనిస్తామని పేర్కొంది.

జిల్లాలో రేషన్ కార్డులు లేని పేదలు వేలాది మంది ఉన్నారు. అయితే గతంలో రేషన్‌కార్డులకోసం వచ్చిన 21,842 దరఖాస్తులను అధికారులు పరిశీలిస్తున్నారు. కాగా కార్డుల్లో కొత్త సభ్యులను చేర్చడం కోసం ఏళ్ల తరబడిగా జనం ఎదురుచూస్తున్నారు. పేర్ల చేర్పుకోసం పదేళ్లలో 60 వేలకుపైగా దరఖాస్తులు వచ్చాయి. కొత్త సభ్యుల పేర్లు చేర్చితే వేలాది కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుంది.

రైతుబంధు పథకం పేరును రైతు భరోసాగా మార్చిన ప్రభుత్వం.. ఎకరానికి ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని ఇటీవలే ప్రకటించింది. సాగుకు యోగ్యమైన భూములకు మాత్రమే రైతుభరోసా ఇస్తామని స్పష్టం చేసింది. గతంలో జిల్లాలో దాదాపు 3 లక్షల మంది రైతులకు ఒక్కో సీజన్‌లో రూ. 260 కోట్లు రైతుబంధు వచ్చింది. ఈసారి ప్రభుత్వం వ్యవసాయ యోగ్యం కాని భూములకు రైతుభరోసా ఇవ్వొద్దని నిర్ణయించిన నేపథ్యంలో 30 వేల ఎకరాల మేర తగ్గవచ్చని భావిస్తున్నారు.

రైతు ఆత్మీయ భరోసా కింద రైతు కూలీలకు ఏడాదికి రూ.12 వేల చొప్పున ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. గతేడాది ఉపాధి హామీ పథకంలో 20 రోజులకు తక్కువ కాకుండా పనిచేసిన కుటుంబాలకు రైతు ఆత్మీయ భరోసా ఇస్తామని పేర్కొంది. జిల్లాలో 20 వేలకుపైగా కుటుంబాలకు లబ్ధి చేకూరవచ్చని భావిస్తున్నారు. వాస్తవంగా వ్యవసాయ భూమి లేని పేదలు చాలా మంది ఉన్నారు. ఉపాధి హామీని ప్రామాణికంగా తీసుకోవడంతో చాలా మంది పేద కూలీలకు అవకాశం దక్కకపోవచ్చని తెలుస్తోంది. మున్సిపాలిటీల్లో విలీనమైన గ్రామాల్లో ఉపాధి హామీ పథకం లేకపోవడంతో ఆయా గ్రామాలకు చెందిన వ్యవసాయ కూలీలకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరే అవకాశం లేదు. దీంతో తాము నష్టపోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పేదలకు దక్కేనా?

ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల ఎంపిక విషయంలో తమకు న్యాయం జరుగుతుందో లేదోనన్న ఆందోళన పేద కుటుంబాల్లో నెలకొంది. దశాబ్దాలుగా ఇళ్ల కోసం, రేషన్‌కార్డుల కోసం తిరుగుతున్న వారంతా ఈసారి తమకు పథకాలు దక్కుతాయని ఆశలు పెట్టుకున్నారు. అయితే ప్రస్తుతం జరుగుతున్న సర్వే తీరును చూస్తుంటే అర్హులకు లబ్ధి చేకూరే అవకాశాలు తక్కువగా కనబడుతున్నాయి. అధికార పార్టీ నేతలు నిర్ణయించిన వారికే లబ్ధి చేకూరుతుందేమోనని చాలామంది భయపడుతున్నారు. పేదలకు ఆయా సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరేలా చూడాలని కోరుతున్నారు.

'పక్కాగా వివరాలు సమర్పించండి'

కామారెడ్డి రూరల్: రైతు భరోసా సర్వేను పక్కాగా నిర్వహించి, వివరాలను నమోదు చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. శనివారం ఆయన క్యాసంపల్లిలో సర్వే నంబర్ 330, 331, 332, 333 లలో గల 58 ఎకరాల భూముల వివరాలను పరిశీలించారు. ఇందులో 30 ఎకరాల భూమి లే ఔట్ చేసి ఉందని, మిగతా 28 ఎకరాలలో పంటలు సాగవుతున్నాయని అధికారులు తెలిపారు. సాగుకు యోగ్యంగా లేని భూములను పరిశీలించి, వివరాలు సమర్పించాలని కలెక్టర్ సూచించారు. ఆయన వెంట ఆర్డీవో రంగనాథ్‌రావు, డీఏవో తిరుమల ప్రసాద్, తహసీల్దార్ జనార్దన్, ఏడీఏ అపర్ణ, ఏఈవోలు తేజస్విని, దేవేంద్ర, ప్రతిమ తదితరులున్నారు.

సంక్షేమ పథకాల అమలు నిరంతర ప్రక్రియ

- అర్హులందరికీ రేషన్ కార్డులు, ఇతర పథకాల వర్తింపు
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు పొంగులేటి, ఉత్తమ్

నిజామాబాద్‌అర్బన్ : ఈ నెల 26 నుంచి ప్రభుత్వం అమలు చేయనున్న నాలుగు సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి కుటుంబానికి వర్తింపజేస్తామని మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి స్పష్టం చేశారు. శనివారం రాత్రి రాష్ట్ర సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. ఆహార భద్రత(రేషన్ కార్డులు), రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు నిరంతర ప్రక్రియగా అమలు చేస్తామన్నారు. ఇప్పటికే ప్రజాపాలన కార్యక్రమం ద్వారా ఆయా పథకాల కోసం ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించామని పేర్కొన్నారు. వాటికి సంబంధించి ప్రతి రెవెన్యూ గ్రామంలో అధికార బృందాలు క్షేత్రస్థాయి పరిశీలన జరుపుతున్నాయన్నారు.

దరఖాస్తులకు అవకాశం..

ఇప్పటికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లు తదితర పథకాల కోసం దరఖాస్తు చేసుకోనివారు ప్రస్తుతం దరఖాస్తు చేసుకోవచ్చని మంత్రులు సూచించారు.

రైతు భరోసా పథకం అమలులో భాగంగా నియమించిన విచారణ బృందాలు వ్యవసాయ యోగ్యం కాని భూముల వివరాలను పక్కాగా నమోదు చేయాలని మంత్రులు సూచించారు. వ్యవసాయ అధికారులు, తహసీల్దార్లు సమన్వయంతో పనిచేసి నివేదిక అందించాలన్నారు. అర్హులైన ప్రతి రైతుకు రైతు భరోసా అమలవుతుందన్నారు. ఇందిరమ్మ ఇల్లు అర్హులైన ప్రతి కుటుంబానికి మంజూరు చేస్తామన్నారు.

ఈనెల 21 నుంచి 24 వరకు నిర్వహించనున్న గ్రామ సభలలో అర్జీలను సమర్పించవచ్చన్నారు. వీలుపడని వారు ప్రజాపాలన సేవా కేంద్రాలలో సంక్షేమ పథకాల కోసం దరఖాస్తులు అందించవచ్చన్నారు. ప్రజాపాలన కార్యక్రమం సందర్భంగా రేషన్ కార్డులు, ఇతర పథకాల కోసం తెల్ల కాగితాలపై వచ్చిన దరఖాస్తులను సైతం పరిశీలించి, అర్హులకు ప్రయోజనం చేకూరుస్తామన్నారు. ఇటీవల జరిపించిన సామాజిక, ఆర్థిక సర్వేలోనూ రేషన్ కార్డులు అవసరం ఉన్న కుటుంబాలను గుర్తించామన్నారు. ఆయా సంక్షేమ పథకాల కింద దరఖాస్తులు చేసుకునే వారి నుంచి అర్జీలు స్వీకరించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు మంత్రులు, సీఎస్ సూచించారు. ఎలాంటి గందరగోళం, తప్పిదాలకు తావు లేకుండా గ్రామ సభలు సజావుగా జరిగేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఈ నెల 26 తర్వాత ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు జారీ
- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ



చెక్కును లబ్ధిదారుకు అందిస్తున్న షబ్బీర్ అలీ

కామారెడ్డి టౌన్ : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని 26 మందికి మంజూరైన రూ. 1.60 కోట్ల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీల కంటే ఎక్కువ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. ఈనెల 26వ తేదీనుంచి అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులను మంజూరు చేస్తామని పేర్కొన్నారు. పేద ప్రజలకు వైద్య సేవల కోసం డిజిటల్ హెల్త్ కార్డు అందజేసి, రూ.10 లక్షల వరకు నిమ్స్‌లో ఉచిత వైద్యం అందేలా చూస్తామన్నారు. ఇప్పటికే రుణమాఫీ చేసి చూపించామని, ఇక రైతు భరోసా త్వరలో అందించబోతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

మరో ఉద్యమానికి రైతన్న సన్నద్ధం

- మాస్టర్ ప్లాన్ జీవో రద్దు కోసం పోరుబాట
- నేటినుంచి గ్రామాలలో సమావేశాలు
- భవిష్యత్ కార్యాచరణ ప్రకటించనున్న జేఏసీ

కామారెడ్డి మాస్టర్ ప్లాన్ జీవో రద్దు జీవో కోసం రైతులు మరో ఉద్యమానికి సన్నద్ధమవుతున్నారు. ఆదివారంనుంచి గ్రామాలవారీగా సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. సమావేశాల అనంతరం భవిష్యత్ కార్యాచరణ ప్రకటించనున్నారు.



మాస్టర్ ప్లాన్ రద్దు కోసం పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు (ఫైల్)

కామారెడ్డి టౌన్ : గత ప్రభుత్వం 2022 నవంబర్‌లో కామారెడ్డి మాస్టర్ ప్లాన్ ముసాయిదా నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ మాస్టర్‌ప్లాన్‌తో కామారెడ్డితోపాటు పట్టణ పరిసరాల్లోని ఎనిమిది గ్రామాల పరిధిలోగల సుమారు 2 వేల ఎకరాలకు పైగా రైతుల భూములు, వ్యవసాయేతర భూములు ఇండస్ట్రియల్, గ్రీన్‌జోన్లుగా మారుతుండడంతో రైతులు ఉద్యమ బాట పట్టారు. ఓ రైతు మరణించడంతో ఉద్యమం మరింత ఉధృతమైంది. సుమారు 45 రోజుల పాటు రైతుల పోరాటం సాగింది. రైతులకు మద్దతుగా బీజేపీ కౌన్సిలర్లు రాజీనామాలకు సిద్ధమవడం, రైతుల కలెక్టరేట్ ముట్టడి తీవ్ర ఉద్రిక్తతకు దారితీయడం, కుటుంబాలతో కలిసి రైతులు రోడెక్కడం వంటి ఘటనలు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించాయి. దీంతో దిగివచ్చిన ప్రభుత్వం మాస్టర్‌ప్లాన్‌ను నిలిపి వేస్తున్నట్లు ప్రకటించడంతో రైతులు ఉద్యమాన్ని విరమించారు.

మళ్లీ తెరపైకి..

2023 జనవరిలో మాస్టర్ ప్లాన్‌ను నిలిపివేస్తున్నట్లు ప్రభుత్వం, మున్సిపల్ శాఖ ప్రకటించాయి. కానీ అధికారికంగా ఎలాంటి జీవో విడుదల చేయలేదు. గత మాస్టర్ ప్లాన్‌లో ఉన్నట్లుగా దేవునిపల్లి నిజాంసాగర్ రోడ్డు నుంచి టేక్రియాల్ బైపాస్ వరకు ఇటీవల రోడ్డు వేయడానికి పనులు ప్రారంభించారు. దీంతో బాధిత రైతులు అప్రమత్తమయ్యారు. ఈ నేపథ్యంలో మాస్టర్ ప్లాన్‌ను పూర్తిగా రద్దు చేస్తూ ప్రభుత్వం అధికారికంగా జీవో విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అడ్లూర్ ఎల్లారెడ్డికి చెందిన బాధిత రైతు ఈనెల 13న మున్సిపల్ కార్యాలయం ముందు నిరవధిక నిరాహార దీక్ష చేపట్టాడు. 8 గ్రామాల రైతులు దీక్షలకు మద్దతు తెలిపారు. కలిసికట్టుగా పోరాటం చేయాలని నిర్ణయించుకుని నిరాహార దీక్ష చేస్తున్న శ్రీకాంత్‌తో దీక్ష విరమింపజేశారు. ఉద్యమంపై చర్చించేందుకు ఆదివారంనుంచి గ్రామాలవారీగా సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఆదివారంనుంచి ఈనెల 26వ తేదీ వరకు టేక్రియాల్, అడ్లూర్‌ఎల్లారెడ్డి, అడ్లూర్, లింగాపూర్, పాతరాజంపేట, రామేశ్వరపల్లి, సరంపల్లి, దేవునిపల్లి గ్రామాలలో రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో సమావేశాలు జరగనున్నాయి. ఆయా సమావేశాలలో మాస్టర్ ప్లాన్‌పై చర్చించి తీర్మానాలు చేయనున్నారు. సమస్యపై చర్చించేందుకు ఎల్లారెడ్డి, కామారెడ్డి ఎమ్మెల్యేలు మదన్‌మోహన్‌రావు, వెంకటరమణారెడ్డిలతో పాటు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీలను కలవాలని నిర్ణయించారు. అనంతరం భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని జేఏసీ ప్రతినిధులు తెలిపారు. మాస్టర్ ప్లాన్ రద్దు జీవో కోసం రైతులంతా మరో ఉద్యమానికి సన్నద్ధమవుతుండడంతో పరిస్థితి ఎలా ఉంటుందోనన్న అంశంపై అంతటా చర్చ నడుస్తోంది.



ఈ నెల 15న శ్రీకాంత్‌రెడ్డితో దీక్షను విరమింపజేయిస్తున్న రైతులు

పెచ్చులూడిన అంగన్‌వాడీ భవనం

చిన్నారులకు తప్పిన ప్రమాదం

నాగిరెడ్డిపేట : నాగిరెడ్డిపేట మండలం జప్తిజాన్కంపల్లి గ్రామంలో శనివారం అంగన్‌వాడీ భవనం పైకప్పు పెచ్చులు ఊడిపడ్డాయి. ఆ సమయంలో కేంద్రంలో చిన్నారుల బరువును తూకం వేస్తున్నారు. చిన్నారులు ఉన్న ప్రాంతానికి కొద్ది దూరంలోనే పెచ్చులు పడ్డాయి. పెచ్చులు పడిన ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. గతంలోనూ అంగన్‌వాడీ భవనం పెచ్చులూడి కిందపడ్డాయి. దీంతో చిన్నారులను కేంద్రానికి పంపేందుకు తల్లిదండ్రులు భయపడుతున్నారు. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి శంకర్‌నాయక్, మాజీసర్పంచ్ దేశబోయిన సాయిలు అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు.



పెచ్చులను పరిశీలిస్తున్న మాజీ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి

క్లుప్తంగా

ఫిబ్రవరిలో మెగా యోగా శిబిరం



కామారెడ్డి అర్బన్: పట్టణంలోని ఫ్రోబెల్స్ హైస్కూల్‌లో ఫిబ్రవరి 1, 2, 3 తేదీల్లో భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో రాందేవ్‌బాబా సన్నిహితులు పరమర్థదేవ్ మెగా యోగా శిబిరం నిర్వహించనున్నట్లు కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. ఈమేరకు శనివారం పట్టణంలో కార్యక్రమ వాల్ పోస్టర్లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు యోగా రాంరెడ్డి, చైర్మన్ అంజయ్య, ప్రతినిధులు అంతిరెడ్డి, అంజయ్య, సిద్దాగౌడ్, ఈశ్వర్ పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



పిట్లం(జుక్కల్): ప్రతిఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను పాటించాలని జాతీయ రహదారి పెట్రోలింగ్ టీం ప్రతినిధులు సూచించారు. మండలకేంద్రంలో శనివారం నేషనల్ హైవే అథారిటీ ఆధ్వర్యంలో వారు రోడ్డు సేఫ్టీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. వాహనదారులకు, ప్రజలకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. సభ్యులు సుభాష్, ప్రతాప్‌సింగ్, ప్రవీణ్, మారుతిరావ్, జైలి, విఠల్, మాణిక్యం, దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ మడిగెలను ఖాళీ చేయాలి



బాన్సువాడ: ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న ఆర్టీసీ మడిగెలను టెండర్ ముగిసిన వ్యాపారులు వెంటనే ఖాళీ చేయాలని డీఎం సరితాదేవి తెలిపారు. గత ఏడాది డిసెంబర్ 31వరకు టెండర్ గడువు ముగిసిందని, మడిగెలను ఖాళీ చేయాలని వ్యాపారులకు నోటీసులు కూడా జారీచేశామని అన్నారు. మడిగెలను ఖాళీ చేయకుంటే పోలీసుల సహాయంతో ఖాళీ చేయాల్సి ఉంటుందన్నారు. వ్యాపారుల వినతిమేరకు వారం గడువు ఇస్తున్నట్లు తెలిపారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి



భిక్కనూరు: ప్రజలకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలి జిల్లా క్లస్టర్ అధికారిణి రుక్మిణి అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని శనివారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ప్రతి కాన్పు ప్రభుత్వాస్పత్రుల్లో జరిగేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. వైద్యురాలు దివ్య, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటరమణ పాల్గొన్నారు.

ఎంబీఏ ఎంట్రెన్స్ టెస్టు నోటిఫికేషన్ విడుదల

నిజామాబాద్ అర్బన్: అంబేడ్కర్ విశ్వవిద్యాలయం అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్‌కేర్, కృష్ణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, దారుస్సలాం ఎడ్యుకేషన్ ట్రస్టు సంయుక్తంగా ఎంబీఏలో ప్రవేశాల కోసం నోటిఫికేషన్‌ను విడుదలైంది. దీనికోసం ఫిబ్రవరి 15లోపు దరఖాస్తు చేసుకోవాలని అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ కో ఆర్డినేటర్ రంజిత ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే యూనివర్సిటీ డిగ్రీ ద్వితీయ, తృతీయ సంవత్సరం, పీజీ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఈ నెల 25లోపు ట్యూషన్ ఫీజు రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు.

ప్రశాంతంగా నవోదయ పరీక్షలు



బాన్సువాడలో నవోదయ పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఈవో రాజు



బిచ్కుందలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

బిచ్కుంద/బాన్సువాడ/ఎల్లారెడ్డి/దోమకొండ: జిల్లాలోని పలు మండలాల్లో శనివారం నిర్వహించిన నవోదయ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. బిచ్కుండలోని పరీక్ష కేంద్రంలో 620 మంది పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా 420 మంది విద్యార్థులు పరీక్ష రాశారని ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బాన్సువాడలో నాలుగు పరీక్ష కేంద్రాలు ఉండగా మొత్తం 641 మంది విద్యార్థులకు గాను 520 మంది విద్యార్థులు హాజరయ్యారు. దోమకొండలోని రెండు పరీక్ష కేంద్రాల్లో 387మంది రావాల్సి ఉండగా 210 మంది హాజరైనట్లు ఎంఈవో విజయ్ కుమార్ తెలిపారు. ఎల్లారెడ్డిలోని రెండు పరీక్ష కేంద్రాల్లో 467మందికి 324 మంది హాజరైనట్లు ఎగ్జామినేషన్ సూపరింటెండెంట్లు మాణిక్యం రాజులు తెలిపారు. ఆయా పరీక్ష కేంద్రాలను స్థానిక అధికారులు తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



ఎల్లారెడ్డి పరీక్ష కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు

సమాచారం..

అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

బాన్సువాడ రూరల్: మండలంలోని శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీకళాశాలలో అతిథి అధ్యాపకుల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ వేణుగోపాలస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, కెమిస్ట్రీ విభాగాల్లో ఒక్కో పోస్టుకు ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 21లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పీజీలో 55శాతం మార్కులతోపాటు సెట్, నెట్, పీహెచ్‌డీ ఇతర అనుభవం ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుందన్నారు.

24న దివ్యాంగుల శిబిరం

బాన్సువాడ రూరల్: బోర్లం రోడ్డులోని అంబేడ్కర్ సంక్షేమ భవన్‌లో ఈనెల 24న దివ్యాంగులకు కావాల్సిన ప్రత్యేక ఉపకరణాల కోసం నిర్ధారణ శిబిరం నిర్వహించనున్నట్లు ఐకేపీ ఏపీఎం పద్మ ఒక ప్రకటనలో తెలిపారు. బాన్సువాడ నియోజకవర్గంలోని బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్, చందూర్, మోస్రా, పొతంగల్, కోటగిరి, రుద్రూర్ మండలాలకు చెందిన వారు హాజరు కావచ్చన్నారు. 80శాతం శారీరక దివ్యాంగులకు బ్యాటరీ ట్రైసైకిల్‌కు అర్హులన్నారు. అలాగే వినికిడి యంత్రాలు, అంధులకు చేతికర్రలు, ప్రత్యేక మానసిక వికలాంగులకు కిట్ సదుపాయాలు కల్పిస్తారన్నారు. సంబంధిత ధృవపత్రాలతో సకాలంలో శిబిరానికి హాజరు కావాలని సూచించారు.

22న ఎల్లారెడ్డిలో..

ఎల్లారెడ్డి: పట్టణంలో ఈనెల 22 దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని ఎల్లారెడ్డి, లింగంపేట్, నాగిరెడ్డిపేట్, తాడ్వాయి, గాంధారి, రాజంపేట, సదాశివనగర్, రామారెడ్డి మండలాల దివ్యాంగులు శిబిరానికి సకాలంలో తరలిరావాలన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

పిట్లం(జుక్కల్): విద్యుత్ మరమ్మతుల కారణంగా ఆదివారం మండలకేంద్రంలో కరెంట్ కోత ఉండనున్నట్లు పట్టణ విద్యుత్‌శాఖ ఏఈ రమేష్ కుమార్, లైన్‌మెన్ సుదర్శన్ ఒక ప్రకటనలో తెలిపారు. తిమ్మనగర్ రోడ్డు, పోలిస్ స్టేషన్ రోడ్డు కాలనీలలో నేడు ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 4:30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండనున్నట్లు తెలిపారు.

రేషన్ బియ్యం పంపిణీ గడువు పెంపు



పిట్లం(జుక్కల్): రాష్ట్ర ప్రభుత్వ రేషన్ బియ్యం పంపిణీ గడువును పొడిగించినట్లు తహసీల్దార్ వేణుగోపాలు తెలిపారు. మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. మండలంలోని తెల్ల రేషన్‌కార్డు ఉన్న ప్రతి లబ్ధిదారునికి రేషన్ బియ్యం పంపిణీ గడువు ఈ నెల 20 వరకు పెంచినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

డ్రెయినేజీలను శుభ్రం చేయండి



కామారెడ్డి అర్బన్: పట్టణ పరిధిలోని దేవునిపల్లి గాయత్రినగర్‌లో డ్రెయినేజీలు అపరిశుభ్రంగా మారాయని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని నెలలుగా మురికికాలువలను శుభ్రం చేయకపోవడంతో వ్యర్థాలు పేరుకుపోయి, పరిసరాల్లో దుర్గంధం వెదజల్లుతోందని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ సానిటేషన్ అధికారులు వెంటనే స్పందించి, సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఆటలతో మానసిక ప్రశాంతత

ఖలీల్‌వాడి: ఆటలతో మానసిక ప్రశాంతత లభిస్తుందని జిల్లా జడ్జి సునీత కుంచాల అన్నారు. గణతంత్ర దినోత్సవాల సందర్భంగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు, న్యాయమూర్తుల క్రీడలను పాలిటెక్నిక్ గ్రౌండ్‌లో శనివారం ఆమె ప్రారంభించారు. న్యాయవాదులు, జడ్జీలు వృత్తిరీత్యా ఒత్తిడికి లోనవుతారని, ఆటలతో ఒత్తిడిని దూరం చేసుకోవాలన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్‌మోహన్ గౌడ్, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు మంథని రాజేందర్, అదనపు జిల్లా జడ్జి శ్రీనివాస్, సీనియర్ సివిల్ జడ్జి శ్రీకాంత్ బాబు, జూనియర్ సివిల్ జడ్జి హరికుమార్, రాజు, వసంత్ రావు, సురేష్ దొన్పల్, పిల్లి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మిల్లర్ల నుంచి బియ్యం రికవరీ చేయాలని వినతి



డీఎస్‌వో అరవింద్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న వినియోగదారుల మండలి సభ్యులు

సుభాష్‌నగర్: జిల్లాలోని 41 రైస్‌మిల్లర్లు ప్రభుత్వానికి ఇవ్వాల్సిన రూ.417 కోట్ల విలువైన బియ్యాన్ని వెంటనే రికవరీ చేయాలని వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి, సీసీఐ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచర్ల సుదర్శన్ డిమాండ్‌చేశారు. ఈమేరకు జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి అరవింద్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కస్టమ్ మిల్లింగ్ రైస్‌ను మిల్లర్లు సకాలంలో ప్రభుత్వానికి ఇవ్వకుండా మోసం చేశారని, వారిపై రెవెన్యూ రికవరీ యాక్ట్‌తోపాటు ఆయా ప్రాంతాల్లోని పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు చేయాలన్నారు. మిల్లర్లు కోర్టు ద్వారా తెచ్చుకున్న స్టేను వేకెట్ చేయించడంలో అధికారులు నిర్లక్ష్యం చేయవద్దని కోరారు. కార్యక్రమంలో వినియోగదారుల సంక్షేమ సమితి జిల్లా అధ్యక్షుడు పెందోట అనిల్ కుమార్, సందు ప్రవీణ్, వీయస్ వర్మ, మహాదేవుని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లాకు మంత్రి జూపల్లి రాక

నిజామాబాద్‌అర్బన్: మంత్రి జూపల్లి కృష్ణా రావు ఆదివారం జిల్లాకు రానున్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్ల స్కీమ్‌లపై సమీక్ష నిర్వహిస్తారు. పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలోని భరోసా సెంటర్, గోల్ హనుమాన్ జోన్ ఆఫీస్ ప్రారంభిస్తారు. వాటర్ డ్రైనేజీ కాలువకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం బహిరంగ సభలో పాల్గొంటారు.

వలస కార్మికులను బంధించి వసూళ్లు

- థాయ్‌లాండ్‌లో ఉపాధి కల్పిస్తామని ఏజెంట్ల మోసం
- ఇరు కుటుంబాలకు రూ.7 లక్షల చొప్పున నష్టం

మోర్తాడ్(బాల్కొండ): విదేశాల్లో ఉపాధి కల్పిస్తామని నమ్మించి మోసగించడమే కాకుండా వలస కార్మికులను తమ వద్ద బందీలుగా చేసుకుని, ఇంటికి పంపించాలంటే మరికొంత డబ్బును బలవంతంగా వసూళ్లు చేసిన ఏజెంట్ల ఘటన వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలం శెట్‌పల్లికి చెందిన సాగర్, జగిత్యాల్ జిల్లా మోహన్‌రావుపేట్‌కు చెందిన అరవింద్ దగ్గరి బంధువులు. ఇక్కడ సరైన ఉపాధి అవకాశాలు లభించకపోవడంతో గల్ఫ్ దేశాలకు వెళ్లాలని భావించారు. వీరిని గమనించిన మెట్‌పల్లి మండలం ఆత్మకూర్‌కు చెందిన ఒక ఏజెంట్ థాయ్‌లాండ్‌లో మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయని, ఒక్కో వీసాకు రూ.5 లక్షలు చెల్లించాల్సి వస్తుందని తెలిపాడు. అక్కడ నెలకు రూ.1.50 లక్షల కంటే ఎక్కువ సంపాదించుకోవచ్చని ఏజెంట్ చెప్పిన మాటలు నమ్మిన సాగర్, అరవింద్‌లు రూ.5 లక్షల చొప్పున చెల్లించి గత సంవత్సరం నవంబర్‌లో ముంబై నుంచి బ్యాంకాక్ వెళ్లారు. అక్కడి నుంచి థాయ్‌లాండ్ బోర్డర్‌ను దాటించడానికి మరికొద్ది మంది దళారులను ఏజెంట్లే నియమించారు. అక్కడే దళారులు సాగర్, అరవింద్‌లను బందీలుగా చేసుకుని అసలు నాటకానికి తెర లేపారు. బాధితుల నుంచి మొబైల్ ఫోన్‌లను లాక్కుని ఇంటికి మాట్లాడకుండా చేశారు. కొన్ని రోజుల తర్వాత థాయ్‌లాండ్‌లో తమవారు కనిపించకుండా పోయారని సాగర్, అరవింద్‌ల కుటుంబ సభ్యులు డిసెంబర్‌లో ప్రవాసీ ప్రజావాణిలో ఫిర్యాదు చేయడంతోనే ఏజెంట్ల మోసం బయటపడింది.

ఏజెంట్ అరెస్టుతో బందీల ఆచూకీ..

ప్రవాసీ ప్రజావాణి గ్రీవెన్స్ సెల్ ప్రత్యేకాధికారి దివ్యాదేవరాజన్ స్పందించి వుమెన్స్ సేఫ్టీ వింగ్ అధికారిణి షికా గోయెల్‌కు సాగర్, అరవింద్‌ల సమస్యను వివరించడంతో పోలీసుల్లో చలనం వచ్చింది. ఆత్మకూర్‌కు చెందిన ఏజెంట్ సమ్మెట రాజును మోర్తాడ్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఏజెంట్ తన అరెస్టు సమాచారాన్ని థాయ్‌లాండ్‌లోని మరో ఏజెంట్‌కు వెళ్లడించడంతో అతను అక్కడ బందీలుగా ఉన్న సాగర్, అరవింద్‌లతో వారి కుటుంబ సభ్యులకు ఫోన్‌లో మాట్లాడించడం మొదలు పెట్టారు. ఒక రోజు ఫోన్‌లో మాట్లాడించడానికి మన కరెన్సీలో రూ.1,500 నుంచి రూ.2 వేలు పంపించాల్సిన దుస్థితి ఏర్పడిందని బాధిత కుటుంబ సభ్యులు వివరించారు. అలా దళారులు బాధిత కుటుంబ సభ్యుల నుంచి డబ్బులు లాగడం మొదలు పెట్టి చివరకు తమ చెరలో ఉన్న వారిని ఇంటికి పంపించాలంటే రూ.2 లక్షల చొప్పున తాము సూచించిన బ్యాంకు ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. తమవారు క్షేమంగా ఇంటికి వస్తే సరిపోతుందనే ఉద్దేశంతో ఇటీవల రూ.4 లక్షలు చెల్లించడంతో సాగర్, అరవింద్‌లు వారం రోజుల కింద ఇంటికి చేరుకున్నారు.

క్రీడా స్ఫూర్తి అలవర్చుకోవాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

నిజామాబాద్ అర్బన్: యువత క్రీడా స్ఫూర్తి అలవర్చుకోవాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని గిరిరాజ్ కళాశాలలో ఖేలో భారత్ క్రీడోత్సవ్ పోటీలను ఆయన ప్రారంభించారు. స్వామి వివేకానంద, సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా ఇలాంటి పోటీలు నిర్వహించాలని సూచించారు. ఏబీవీపీ ఇందూర్ విభాగ్ ప్రముఖ్ రెంజర్ల నరేశ్ మాట్లాడుతూ డ్రగ్స్ లేని సమాజాన్ని నిర్మిద్దామన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా మైదానాల్లో ఆడాలని యువతకు సూచించారు. కార్యక్రమంలో విభాగ్ సంఘటన మంత్రి రాజు సాగర్, గిరిరాజ్ కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్ రెడ్డి, కైరి శశిధర్, ప్రవీణ్, గొడుగు వెంకటకృష్ణ, దామ సుమన్, బాలకృష్ణ, గోపి, దుర్గాదాస్, మహేష్, ప్రీతం, గణేశ్ పాల్గొన్నారు.



క్రికెట్ ఆడుతున్న ఎమ్మెల్యే

21న ఉచిత కాలేయ స్క్రీనింగ్ టెస్ట్

సుభాష్‌నగర్: తెలంగాణ ఆల్ పెన్షనర్స్-రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్, మల్లు స్వరాజ్యం మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 21న నగరంలోని మల్లు స్వరాజ్యం ట్రస్ట్ భవన్‌లో ఉచిత కాలేయ స్క్రీనింగ్ టెస్ట్, హెల్త్ క్యాంపు నిర్వహించనున్నట్లు స్తున్నట్లు యూనియన్ జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్‌రావు తెలిపారు. శనివారం నగరంలోని ట్రస్ట్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.6వేల విలువైన ఈ టెస్టును రిటైర్డ్ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యుల కోసం ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో ఎస్ మదన్మోహన్, ఈవీఎల్ నారాయణ, ప్రసాద్‌రావు, నరేందర్, చంద్రశేఖర్, రాధాకిషన్, పూర్ణచంద్ర రావు, సిర్ప లింగయ్య పాల్గొన్నారు.

క్రైం కార్నర్

మహిళ దారుణ హత్య

- ఏడు నెలల తర్వాత వెలుగులోకి..
- పోలీసుల అదుపులో నిందితులు



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు



విజయ (ఫైల్)

మోపాల్: మోపాల్ మండల కేంద్రంలో మహిళ దారుణ హత్యకు గురైంది. ఏడు నెలల తర్వాత ఘటన వెలుగులోకి రావడం శనివారం కలకలం రేపింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మోపాల్ గ్రామానికి చెందిన జంగం గంగారాం, విజయ భార్యభర్తలు. వీరికి మనోహర్, స్రవంతి సంతానం. దంపతుల మధ్య రెండేళ్ల క్రితం గొడవలు కావడంతో అప్పటి నుంచి దూరంగా ఉంటున్నారు. అదే గ్రామంలో ఉన్న చెల్లెలు భాగ్యలక్ష్మి వద్ద విజయ ఉంటోంది. ఏడు నెలల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిన విజయ తిరిగి రాకపోవడంతో భాగ్యలక్ష్మి, విజయ భర్త గంగారాంనకు తెలియజేసింది. కుటుంబానికి దూరంగా ఉంటుండటంతో వారు కూడా పట్టించుకోలేదు. అయితే ఈ నెల 16న విజయ కుమారుడు తన తల్లి కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన తల్లితో డబ్బుల విషయంలో రోడ్ బుచ్చన్నతో పలుమార్లు గొడవ జరిగిందని, ఆయనపై అనుమానముందని చెప్పాడు. అదేరోజు అనుమానితుల ను అదుపులోకి తీసుకుని పోలీసులు విచారించా రు. విచారణలో హత్య చేసినట్లు నిందితులు ఒ ప్పుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సురేష్ తెలిపారు.

చిట్టీ డబ్బులు అడగడంతో..

మోపాల్‌కు చెందిన బుచ్చన్న వద్ద విజయ రూ.లక్ష చిట్టీ వేసింది. చిట్టీ గడువు ముగిసినా.. డబ్బులు చెల్లించడంలేదు. దీంతో ఆమె బుచ్చన్నను డబ్బులు చెల్లించాలని ఒత్తిడి తెచ్చింది. దీంతో బుచ్చన్న ఎలాగైనా విజయ అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకున్నాడు. తన వద్ద పశువుల కాపరిగా ఉన్న కోటగిరి మండలం కొడిచర్లకు చెందిన నగేష్‌కు విషయాన్ని తెలియజేశాడు. నగేష్ విజయను నమ్మించి కల్లు తాగుదామని గ్రామ శివారున కల్వర్టు వద్దకు రప్పించాడు. కల్లు తాగిన తర్వాత ఆమె చీర కొంగుతో గొంతుకు ఉరి వేసి హత్యచేశాడు. అక్కడే పంట నీటి కాల్వలో మృతదేహాన్ని పూడ్చిపెట్టారు. శనివా రం విజయ మృతదేహాన్ని పాతిపెట్టిన చోట పో లీసులు జేసీబీతో వెలికితీశారు. ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి, సీఐ సురేశ్, ఎస్సై యాదగిరి గౌడ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఏడు నెలలు గడవడంతో ఎముకలు, చీర మాత్రమే తవ్వకాల్లో బయటపడ్డాయి. చీర విజయదే అని నిర్ధారణకు వచ్చిన పోలీసులు అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు.

మైనర్లు వాహనాలను నడపొద్దు



మాట్లాడుతున్న డీటీవో శ్రీనివాస్‌రెడ్డి

భిక్కనూరు: మైనర్లు వాహనాలను నడిపించవద్దని జిల్లా రవాణాశాఖాధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. భిక్కనూరు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం ఆయన రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలను పాటిస్తే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చన్నారు. అనంతరం భిక్కనూరులో పలు వాహనాల డ్రైవర్లకు రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన కల్పించారు. ఎంవీఐ నాగలక్ష్మి, ఏఎంవీఐలు అఫ్రోజ్, తేజ, అర్షద్, శంకర్, ఆర్టీవో సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ కాయిల్స్ చోరీ



లక్కంపల్లి శివారులోని తల్వేద ఎత్తిపోతల పథకం వద్ద చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్

నందిపేట్: మండలంలోని తల్వేద ఎత్తిపోతల పథకం పరిధిలోని లక్కంపల్లి గ్రామ శివారులో గల రెండో పంపు హౌజ్ వద్ద గల ట్రాన్స్‌ఫార్మర్ కాయిల్స్ చోరీ అయ్యాయి. శుక్రవారం రాత్రి సమయంలో లక్కంపల్లి లిఫ్ట్ బావి వద్ద గల ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి అందులో నుంచి రాగి కాయిల్స్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. ఈ మేరకు ఎత్తిపోతల కమిటీ సభ్యులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో సైతం తల్వేద మొదటి పంపు హౌజ్ వద్ద, సీహెచ్ కొండూర్, ఉమ్మెడ పంపుహౌజ్ వద్ద గల ట్రాన్స్‌ఫార్మర్ల రాగి తీగలను చోరీ చేశారు.

మురికి కాలువలో పసికందు మృతదేహం

ఖలీల్‌వాడి: నగరంలోని ఆరో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని భగత్ సింగ్ కాలనీలోని మురికి కాలువలో నవజాత శిశువు మృతదేహం లభ్యమైంది. గుర్తు తెలియని వ్యక్తులు మగ శిశువు మృతదేహం పడేసినట్లు ఎస్సై మహేష్ తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆరుగురిపై కేసు నమోదు

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలోని ఎర్రమన్ను కుచ్చ ప్రాంతానికి చెందిన ఖాజా దాదయ్య, అతని కుటుంబ సభ్యులపై దాడి చేశారన్న ఫిర్యాదుతో ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. తన ఇంటి పక్కనే ఉన్న టేకు కాశీరాం అనే వ్యక్తి తమ కుటుంబ సభ్యులతో తరచూ గొడవ పడేవారని బాధితుడు తెలిపినట్లు ఎస్సై తెలిపారు. ఈ నేపథ్యంలో శుక్రవారం నీటి విషయమై ఇరు కుటుంబాలకు జరిగిన వివాదంలో కాశీరాంతో పాటు అతని కుటుంబ సభ్యులు తనతో పాటు తన తమ్ముడి భార్య నాగమణి, కోడలు శాంతను కట్టెలతో కొట్టారని ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కాశీరాం, ఆయన భార్య పోశవ్వ, కొడుకులు రమేష్, రాములు కోడలు అనిత, కూతురు సంధ్యపై కేసు నమోదు చేశామన్నారు.

తల్లీకొడుకు అదృశ్యం

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి మండలం యానంపల్లి గ్రామానికి చెందిన కంఠేశ్వర్ మేఘన(25), ఆమె కొడుకు గౌరీష్ (6) కనిపించకుండా పోయినట్లు ఎస్సై ఎండీ షరీఫ్ తెలిపారు. శనివారం ఉదయం నుంచి ఇద్దరు కనబడటం లేదు. పలు చోట్ల గాలించినా ఆచూకీ లభించకపోవడంతో ఆమె అత్త సావిత్రి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

టైర్ పేలి రాయిని ఢీకొన్న ట్రాలీ ఆటో



నిజాంసాగర్: మహమ్మద్ నగర్ మండలం గాలీపూర్ శివారులో నిజాంసాగర్ ప్రధాన కాలువ మూలమలుపు వద్ద శనివారం ట్రాలీ ఆటో టైర్ పేలి బండరాయిని ఢీకొంది. ట్రాలీ ఆటోలో ఐస్‌బాక్సుల్లో ఉన్న చేపలు రోడ్డుపై పడి మృతి చెందాయి.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట

లింగంపేట: మండలంలోని ఓ గ్రామానికి చెందిన ప్రేమజంట శనివారం పోలీసులను ఆశ్రయించింది. గ్రామానికి చెందిన యువతి, యువకుడు కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. కులాలు వేరు కావడంతో పెద్దలు పెళ్లికి నిరాకరించారు. దీంతో వారు యాదగిరిగుట్టలో పెళ్లి చేసుకొని, లింగంపేట పోలీసులను ఆశ్రయించారు. దాంతో ఎస్సై సుధాకర్ వారి కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

రుద్రూర్: కోటగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోతంగల్ మండలం కొడిచర్ల శివారు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. శుక్రవారం రాత్రి ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకుని చర్యల నిమిత్తం సంబంధిత అధికారులకు అప్పగించామన్నారు.

అటవీ భూమి చదును చేస్తున్న ట్రాక్టర్..

ఇందల్వాయి: ఇందల్వాయి ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని ధర్పల్లి బీట్‌లో అటవీ భూమిని చదును చేస్తున్న ట్రాక్టర్‌ని శనివారం సీజ్ చేసినట్లు ఎఫ్‌ఆర్వో రవి మోహన్ భట్ తెలిపారు. అటవీ చట్టాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

చికిత్స పొందుతూ మృతి

భిక్కనూరు: ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలోని బస్వాపూర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన మహ్మద్ సాజీద్(60) కిరాణాషాపు నిర్వహిస్తూ జీవిస్తున్నాడు. ఆయన రెండెళ్ల క్రితం గుండెకు శస్త్ర చికిత్స చేయించుకున్నాడు. అప్పటి నుంచి తరుచూ అనారోగ్యానికి గురవుతున్నాడు. ఈ క్రమంలో గురువారం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు రషీద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై పేర్కొన్నారు.

స్వాగత తోరణాన్ని ఢీకొన్న లారీ



కూలిపోయిన ఖానాపూర్ స్వాగత తోరణం

నిజామాబాద్ రూరల్: నగర శివారులోని ఖానాపూర్ స్వాగత తోరణాన్ని లారీ ఢీకొట్టింది. శుక్రవారం రాత్రి లారీ ఢీకొనడంతో కమాన్ కూలిపోయింది. ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు స్వల్పగాయాలు అయ్యాయి.